క్లుప్తంగా

రైలు ప్రమాద బాధితులకు రెడ్‌క్రాస్ సేవలు



రైలు ప్రమాద బాధితులకు బిస్కెట్లు, బ్రెడ్, మంచినీరు అందిస్తున్న రెడ్‌క్రాస్ వలంటీర్

మహారాణిపేట : బాలాసోర్‌లో జరిగిన రైలు ప్రమాదంలో గాయపడ్డ వారికి విశాఖ రెడ్‌క్రాస్ వలంటీర్లు వైద్య సేవలు అందిస్తున్నారు. విశాఖ రైల్వే స్టేషన్‌లో మజ్జిగ, బిస్కెట్లు, నీరు, పెయిన్ కిల్లర్ మందులు, స్ప్రేలు, పారాసిట్ మాల్ ట్యాబ్‌లెట్లు అందజేస్తున్నారు. అదే విధంగా బాధితుల సేవల్లో కూడా రెడ్‌క్రాస్ వలంటీర్లు పాల్గొన్నారని విశాఖ రెడ్ క్రాస్ సొసైటీ ప్రతినిధులు తెలిపారు.

బల్లిగిరి వెంకన్న సన్నిధిలో ఎమ్మెల్యే వాసుపల్లి



బల్లిగిరి వెంకన్నకు పూజలు చేస్తున్న ఎమ్మెల్యే వాసుపల్లి

అల్లిపురం: ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ శనివారం వెంకటేశ్వరమెట్టలోని బల్లిగిరి ప్రసన్న వేంకటేశ్వరస్వామిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆయనకు ఆలయ ఈవో జీవీ రమాబాయ్, అర్చకుడు గొడవర్తి రఘునాథాచార్యులు స్వాగతం పలికారు. స్వామివారికి పూజలు చేసిన అనంతరం తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఆయన వెంట పార్టీ నాయకలు బొడ్డేటి ప్రసాద్, యల్లంకి చిన్నమ్మలు, బోణి దేవ, కణిత బ్రహ్మం తదితరులు పాల్గొన్నారు.

చిన్నారులకు డ్రాయింగ్ పోటీలు



తాము గీసిన చిత్రాలతో చిన్నారులు

దాబాగార్డెన్స్: వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా జిల్లా కేంద్ర గ్రంథాలయంలో శనివారం చిన్నారులకు డ్రాయింగ్ పోటీలు నిర్వహించారు. సెయింట్ ఆంథోనీ ఉన్నత పాఠశాల తెలుగు ఉపాధ్యాయుడు డి. సంజీవకుమార్ పాల్గొని పర్యవేక్షించారు. విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికి తీసేందుకు పోటీలు దోహదపడతాయన్నారు. గ్రంథాలయ అధికారి రాజేంద్రవర్మ మాట్లాడుతూ ప్రతి రోజూ పలు అంశాలపై శిక్షణ ఇవ్వడంతో పాటు పోటీలు నిర్వహిస్తున్నామని తెలిపారు. పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు ఈ నెల 11న బహుమతులు అందజేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ప్రథమ ఇనిస్టిట్యూట్ ప్రతినిధి అనురాధ, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ మహిళా కళాశాలలో స్వచ్ఛతా కార్యక్రమం



మొక్కలు నాటుతున్న ప్రిన్సిపాల్ శోభారాణి

దాబాగార్డెన్స్: విశాఖ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో జీ–20 భగీరథీ కార్యాచరణలో భాగంగా శనివారం స్వచ్ఛతా కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్. శోభారాణి పాల్గొని విద్యార్థులకు కార్యక్రమంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రాంగణంలో మొక్కలు నాటారు. ఎన్ఎస్ఎస్ కో ఆర్డినేటర్ డాక్టర్ ఏహెచ్‌డీ పుష్పలత, కళాశాల స్కిల్ కోఆర్డినేటర్ డాక్టర్ ఎ. హైమావతి, ఏపీఎస్ఎస్‌డీసీ స్కిల్ హబ్ కో ఆర్డినేటర్లు కె. ప్రశాంతి, గోపాలరావు, ట్రైనర్ బి. సునీల్ విద్యార్థులు పాల్గొన్నారు.

పబ్లిక్ డిమాండ్

దీపాలు వెలిగించరూ..



వార్డులో వెలగని విద్యుత్ దీపాలు

అల్లిపురం: జీవీఎంసీ పరిధి 33వ వార్డులో అంధకారం అలముకుంది. వార్డులో ప్రతి వీధిలోను గత రెండు నెలలుగా విద్యుత్ దీపాలు వెలగక చీకటి అలుముకుందని స్థానికులు వాపోతున్నారు. దీంతో కుక్కల బెడద ఏర్పడిందని వాపోతున్నారు. పలుమార్లు జీవీఎంసీ విద్యుత్ విభాగానికి, సచివాలయంలో ఫిర్యాదు చేసినా పరిష్కరించలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చీకటి పడితే చిన్నారులను బయటికి పంపాలంటే భయమేస్తుందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వార్డులో వెంకటేశ్వరమెట్ట శ్రీ వెంకట గౌరీ శంకర గ్రంథాలయం వద్ద 2, పాల సంఘం వద్ద ఒకటి, సాయిబాబావీధి, వేంకటేశ్వరస్వామి గుడి వద్ద, సింహాలదేవిడి పంప్ హౌస్ వద్ద, వేంకటేశ్వరస్వామి పాదాల వద్ద, గౌరీ స్ట్రీట్ సచివాలయం వీధిలో 5 వీధి దీపాలు వెలగడం లేదని తెలిపారు. ఇప్పటికైనా జీవీఎంసీ అధికారులు స్పందించి విద్యుత్ దీపాలను పునరుద్ధరించాలని తెలిపారు.

కార్యకర్తల కోసం గ్రీవెన్స్ నిర్వహణ



కార్యకర్తల నుండి వినతులు స్వీకరిస్తున్న ఎమ్మెల్యే వాసుపల్లి

దాబాగార్డెన్స్: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ దక్షిణ నియోజకవర్గ కార్యకర్తల కోసం ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ శనివారం ఎమ్మెల్యే కార్యాలయంలో గ్రీవెన్స్ నిర్వహించారు. ముఖ్యంగా వైఎస్సార్ సీపీ కార్యకర్తల సమస్యల పరిష్కారానికి ఈ గ్రీవెన్స్ ప్రతి శనివారం నిర్వహించనున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు. ఈ సందర్భంగా 36వ వార్డు అధ్యక్షుడు మాసిపోగు రాజు, 35వ వార్డు అధ్యక్షుడు అలపన కనకరెడ్డితో పాటు పలు వార్డుల నాయకులు దేవదాయ శాఖలో ట్రస్ట్‌బోర్డు సభ్యులను నియమించాలని వినతిపత్రం అందజేశారు. నిరుపేద కార్యకర్తల పిల్లల చదువుకు ప్రైవేట్ కళాశాలలు, స్కూళ్లలో ఫీజు తగ్గించేందుకు కరస్పాండెంట్లతో ఎమ్మెల్యే మాట్లాడారు. అలాగే కొంత మంది కార్యకర్తల పిల్లలు ప్రభుత్వ రెసిడెన్షియల్ కళాశాల, స్కూళ్లలో ఉచితంగా చదువుకునేందుకు సిఫార్స్ చేశారు. ఎమ్మెల్యే సొంత కళాశాలలు వైజాగ్ డిఫెన్స్ అకాడమీ, రామబాణంలో నిరుపేద కార్యకర్తల పిల్లలకు లక్షల విలువ చేసే ఇంటర్మీడియట్ విద్య ఉచితంగా అందించనున్నట్లు చెప్పారు. ప్రభుత్వ ఉద్యోగులు, సచివాలయ సిబ్బందికి బదిలీ సిఫార్సు లేఖలు అందజేశారు. అలాగే ప్రైవేట్ ఫంక్షన్ హాళ్లలో కార్యకర్తలకు రాయితీలు ఇప్పించాలని కోరారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు, వార్డు అధ్యక్షులు, స్టేట్ డైరెక్టర్లు, జిల్లా, అనుబంధ నాయకులు, సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు పాల్గొన్నారు.

సంపత్ వినాయగర్ హుండీ ఆదాయం రూ. 16.9 లక్షలు



హుండీ ఆదాయం లెక్కిస్తున్న శివజ్యోతి సేవా సంఘం సభ్యులు

సీతమ్మధార : ఆశీలమెట్టలో గల సంపత్ వినాయగర్ ఆలయంలో శనివారం దేవదాయ శాఖ తనిఖీదారు ఎ.జగన్నాథం పర్యవేక్షణలో హుండీ లెక్కింపు జరిగింది. 23 రోజులకు గాను రూ.16 లక్షల 92 వేల 807 రూపాయల నగదుతో పాటు 5.2 గ్రాముల బంగారం, వెండి 165 గ్రాములు విరాళంగా వచ్చింది. అలాగే 31 యుఎస్ఏ డాలర్లు, 2 సింగపూర్ డాలర్లు హుండీ ఆదాయంగా వచ్చినట్లు ఆలయ ఫౌండర్ ఫ్యామిలీ మెంబర్ టి.ఆర్.చోళన్ వెల్లడించారు. హుండీ లెక్కింపులో శివజ్యోతి, శ్రీ వెంకటేశ్వర సేవా సంఘం సభ్యులతో పాటు దేవాలయ సిబ్బంది జి.గోవింద్ రెడ్డి, డీఎస్ ప్రసాద్, ఈ. అప్పలరాజు తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్యం పట్ల జాగ్రత్తలు తప్పనిసరి



ఎమ్మెల్యే వాసుపల్లిని సత్కరిస్తున్న నాయకులు

అల్లిపురం: ఆరోగ్యం పట్ల ప్రతి ఒక్కరు జాగ్రత్త వహించాలని ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ అన్నారు. ఓమ్ని ఆర్కే ఆస్పత్రి సహకారంతో వెంకటేశ్వరమెట్టలోని శ్రీ వెంకట గౌరీ శంకర గ్రంథాలయం ఆవరణలో వైఎస్సార్‌సీపీ పార్లమెంట్ జిల్లా కార్యదర్శి బొడ్డేటి ప్రసాద్ ఆధ్వర్యంలో శనివారం ఏర్పాటు చేసిన ఉచిత మెడికల్ క్యాంపును ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రారంభించారు. క్యాంపులో 260 మందికి బీపీ, షుగర్, ఈసీజీ తదితర పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేను వైఎస్సార్‌సీపీ నాయకులు సత్కరించారు. కార్యక్రమంలో 33వ వార్డు అధ్యక్షుడు రంధి గోపీకృష్ణ, గౌరీ సంఘం అధ్యక్షుడు బీశెట్టి శ్రీను, కార్యదర్శి శరగడం మోహన్, కోరిబిల్లి త్రినాథ్, వార్డు మహిళా అధ్యక్షురాలు యల్లంకి చిన్నమ్మలు, స్టేట్ ఎస్సీ సెల్ కార్యదర్శి బోణి దేవ, కణిత బ్రహ్మం, బొడ్డేటి కిషోర్, అనురాధ, కొడమంచిలి శ్రీను, పిల్లి శివ, ఓమ్ని ఆస్పత్రి వైద్యుడు వంశీ, గౌరీనాయుడు, సిబ్బంది పాల్గొన్నారు.

మజ్జిగ పంపిణీ



మజ్జిగ పంపిణీ చేస్తున్న వాసవీ క్లబ్ ప్రతినిధులు

అల్లిపురం: వాసవీ క్లబ్ ఆధ్వర్యంలో నెల రోజులుగా మజ్జిగ పంపిణీ కార్యక్రమం నిర్వహిస్తున్నారు. దీంట్లో భాగంగా శనివారం వాసవీ క్లబ్ అల్లిపురం ప్రతినిధి ఆదినారాయణమూర్తి, అతని కుమార్తె శ్రావణి సహకారంతో అల్లిపురం గాంధీ విగ్రహం వద్ద పాదచారులు, వాహన చోదకులకు మజ్జిగ పంపిణీ చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సేవా కార్యక్రమాలు దైవారాధనలో భాగమేనని అభిప్రాయపడ్డారు. కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షుడు డీవీఎస్ఎన్ రాజు, రీజనల్ చైర్‌పర్సన్ వరిగాల పండు, పూర్వ అధ్యక్షుడు శీమకుర్తి విటల్ కుమార్, ఉపాధ్యక్షుడు సలాది సుబ్రహ్మణ్యం, దాసు విజయకుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా మన్యుసూక్త హోమం



శ్రీఆంజనేయస్వామి దేవాలయంలో హోమం నిర్వహిస్తున్న దృశ్యం

మహారాణిపేట: మెయిన్ రోడ్డులో ఉన్న శ్రీ ఆంజనేయస్వామి వారి దేవాలయంలో జ్యేష్ఠపౌర్ణమిని పురస్కరించుకుని శనివారం మన్యుసూక్త హోమం ఘనంగా జరిగింది. హోమంలో భక్తులు పాల్గొని స్వామికి పూజలు చేశారు. ప్రతినెల పౌర్ణమి రోజున స్వామివారికి హోమం నిర్వహిస్తున్నట్టు దేవస్థానం ఈవో అల్లు జగన్నాథం ఒక ప్రకటనలో తెలిపారు. స్వామి పూజ వల్ల నరఘోష, శత్రు ఘోష, రుణబాధ, గ్రహదోష శాంతి సిద్ధిస్తాయన్నారు. శనివారం హోమం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు సాగింది. పూజల అనంతరం స్వామి వారి ప్రసాద వితరణ జరిగింది.

సీతారామచంద్రస్వామికి చక్రస్నానం



స్వామి చక్రస్నానం నిర్వహిస్తున్న రుత్వికులు



పూర్ణాహుతిలో పాల్గొన్న ఈవో శిరీష, ధర్మకర్తల మండలి చైర్‌పర్సన్ కొల్లి సింహాచలం

దాబాగార్డెన్స్: కనకమహాలక్ష్మి దత్తత దేవాలయమైన అంబికాబాగ్ సీతారామచంద్రస్వామి ఆలయంలో నిర్వహిస్తున్న వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం స్వామికి విశేష ఆరాధన, నిత్య హోమం నిర్వహించారు. అనంతరం ఆలయ బేడా ప్రదక్షిణ జరిపారు. తర్వాత స్వామికి అవభృదోత్సవం, స్వామికి చక్రస్నానం జరిపారు. అనంతరం స్వామికి పూర్ణాహుతి కార్యక్రమం అత్యంత వైభవంగా నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ ఈవో కె. శిరీష, ధర్మకర్తల మండి చైర్‌పర్సన్ కొల్లి సింహాచలం, ధర్మకర్తలు సత్యరూపవాణి, ఎస్ఎస్ఎస్ సుబ్రహ్మణ్యం, ఏఈవో కె. తిరుమలేశ్వరరావు, భక్తులు పాల్గొన్నారు.

అన్నప్రసాద పథకానికి రూ.లక్ష విరాళం



దాతకు బాండ్ అందజేస్తున్న సూపరింటెండెంట్ నరసింగరావు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి శాశ్వత అన్నప్రసాద పథకానికి శనివారం విశాఖలోని ఎల్లమ్మ ఆలయం ప్రాంతానికి చెందిన బి.రాఘవేంద్ర గౌతమ్ పుష్కర్ అనే దాత రూ.లక్ష విరాళం ఇచ్చారు. సింహగిరిపై దేవస్థానం తరపున దాతకు అన్నదాన భవనంలో సూపరింటిండెంట్ పాలూరి నరసింగరావు బాండ్ అందజేశారు.

కల్యాణం.. కమనీయం



పల్లకీ సేవలో పాల్గొన్న భక్తులు

- కనులపండువగా
- శ్రీ ఉమా చంద్రమౌళీశ్వరస్వామి పరిణయం



కల్యాణమూర్తులు

అల్లిపురం : ముక్కంటి కల్యాణం నేత్రపర్వంగా సాగింది. ఉమా చంద్రమౌళీశ్వరస్వామి కల్యాణానికి భక్తులు పోటెత్తారు. టూటౌన్ దరి శ్రీ శివరామకృష్ణ దేవస్థానంలో గత మూడు రోజులుగా ఉమా చంద్రమౌళీశ్వరస్వామి వార్షిక కల్యాణోత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. శనివారం జ్యేష్ఠపౌర్ణమిని పురస్కరించుకుని భార్గవశర్మ ఆధ్వర్యంలో స్వామి వారి కల్యాణం నిర్వహించారు. ఈవో రమాభాయి దేవాదాయ శాఖ తరపున పట్టు వస్త్రాలు సమర్పించారు. స్వామి ఉత్సవ విగ్రహాల తిరువీధి నిర్వహించారు.

మరో గ్రంథాలయ ఉద్యమం అవసరం



బైకు యాత్రికుడు వెంకటేశ్వర్లును అభినందిస్తున్న డి.వి.సూర్యారావు, సాహితీవేత్తలు

సీతంపేట: గ్రంథాలయాల పరిరక్షణకు రాష్ట్ర వ్యాప్తంగా బైకుపై సంచరిస్తున్న ఒంగోలుకు చెందిన మంచికంటి వెంకటేశ్వర్లు శనివారం ఉదయం నగరానికి చేరుకున్నారు. ద్వారకా నగర్ పౌర గ్రంథాలయానికి వచ్చిన ఆయనకు లైబ్రరీ సహ కార్యదర్శి డి.వి.సూర్యారావు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా నిర్వహించిన సమావేశంలో వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ఒంగోలులో బయలుదేరి రాయలసీమ అంతా పర్యటించి, కోస్తా జిల్లాల మీదుగా ఉత్తరాంధ్రకు వచ్చానని తెలిపారు. గ్రంథాలయాల పరిరక్షణ, అభివృద్ధికి మరో గ్రంథాలయ ఉద్యమం అవసరమన్నారు. ప్రజల వద్దకు పుస్తకం తన నినాదమని, సొంత డబ్బుతో పుస్తకాలు ముద్రించుకునే వారు లేక కొంత మంది రచయితలు నిరాశ, నిస్పృహలో ఉన్నారన్నారు. ప్రభుత్వాలు పట్టించుకోవడం లేదని, వదాన్యులు, సేవా తత్పరులు గ్రంథాలయాలను ప్రోత్సహించాలని కోరారు. పాఠశాలల్లో గ్రంథాలయాలు పిల్లలకు దేవాలయాలని అభివరించారు. రచయితల కోసం సహకార వేదికలు ఏర్పాటు కావాలని సూచించారు. తన పర్యటనలో అనుభవాలను వివరించారు. విశాఖ పౌర గ్రంథాలయం ప్రగతి అభినందనీయని, ఇతర ప్రాంతాల వారికి ఇది ఒక మంచి నమూనాగా పేర్కొన్నారు. మిత్ర సాహితి వర్మ, అరసం కార్యదర్శి ఉప్పల అప్పలరాజు, మస్తాన్‌రెడ్డి, విశాలాంధ్ర బుక్ హౌస్ రాజు, కత్తి పద్మ తదితరులు వెంకటేశ్వర్లును అభినందించారు.

మత్స్యకారులకు ప్రత్యేక శిక్షణ



శిక్షణ పొందిన మత్స్యకారులతో అధికారులు

మహారాణిపేట : సముద్రంలో ప్రయాణించే మత్స్యకారులు అత్యవసర పరిస్థితుల్లో తగిన జాగ్రత్తలు పాటించడం ద్వారా ప్రాణాలు రక్షించుకోవచ్చని జిల్లా మత్స్యశాఖ జాయింట్ డైరెక్టర్ జి.విజయ పేర్కొన్నారు. మత్స్యశాఖ ఆధ్వర్యంలో జిల్లాలోని మత్స్యకారులకు బేసిక్ లైఫ్ సపోర్టు (బీఎల్ఎస్) అంశంపై నైపుణ్యాభివృద్ధి శాఖ అధికారులు శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా శనివారం కొత్తజాలారిపేట గంగాదేవి ఆలయ ప్రాంగణంలో 50 మంది మత్స్యకారులకు నేషనల్ ఫిషరీస్ డెవలప్‌మెంటు బోర్డు (ఎన్ఎఫ్‌డీబీ) ఆర్థిక ప్రోత్సాహంతో శిక్షణ ఇచ్చారు. శిక్షణలో పాల్గొన్న వారికి ఆస్ట్రేలియన్ లైఫ్ సేవింగ్ అకాడమీ (ఏఎల్ఎస్ఏ) సర్టిఫికెట్లు అందజేసింది. మూడు రోజుల శిక్షణలో పాల్గొన్న వారికి రోజుకు రూ.300 రూపాయలు చొప్పున వారి బ్యాంకు ఖాతాల్లో జమ చేయనున్నట్లు జేడీ విజయ తెలిపారు. ఈ కార్యక్రమంలో ట్రైనింగ్ డైరెక్టర్ భరత్, సీనియర్ ట్రైనర్ బాలు, కొండలరావు, వివిధ మత్స్యకార సంఘాల నాయకులు, మత్స్యశాఖ సహాయ సంచాలకులు విజయకృష్ణ, మత్స్యశాఖాభివృద్ధి అధికారి డి.మురళి, మత్స్యశాఖ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మానవ హక్కుల పరిరక్షణే ధ్యేయం



సమావేశంలో మాట్లాడుతున్న శ్యాంప్రసాద్

దాబాగార్డెన్స్: మానవ హక్కుల పరిరక్షణకు కట్టుబడి పని చేయాలని మానవ హక్కుల కౌన్సిల్ కార్యదర్శి ఎం. శ్యాంప్రసాద్ తెలిపారు. కౌన్సిల్ సభ్యులు, ప్రతినిధులకు క్రమశిక్షణ తప్పనిసరి అని పేర్కొన్నారు. అల్లూరి విజ్ఞాన కేంద్రంలో విధుల నిర్వహణకు సంబంధించి కౌన్సిల్ సభ్యులకు నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. బాధితులపై కౌన్సిల్ సభ్యులు బెదిరింపులకు పాల్పడితే చట్టపర చర్యలు తప్పవని హెచ్చరించారు. మానవ హక్కుల కౌన్సిల్ వలంటీర్లు తమకు తామే జవాబుదారీగా, నిజాయితీగా ఉండాలని, హక్కుల పరిరక్షణకు కట్టుబడి పని చేయాలన్నారు. ఈ నెల 5న ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఎస్. కోటలో వెయ్యికి పైగా మొక్కలు నాటనున్నట్టు శ్యాంప్రసాద్ చెప్పారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఎస్వీ రమణ, సూర్య, శ్రీనివాస్, ప్రసాద్, సీనియర్ సభ్యుడు గుండు అప్పలరాజు తదితరులు పాల్గొన్నారు.

బాలికలకు శానిటరీ నాప్‌కిన్స్ అందజేత



పోస్టర్ ఆవిష్కరిస్తున్న టూటౌన్ సీఐ తిరుమలరావు, డాక్టర్ రాధిక తదితరులు



బాలికలకు శానిటరీ నాప్‌కిన్స్ అందజేస్తున్న డాక్టర్ రాధిక పాటూరి

అల్లిపురం: మహావీర్ ఇంటర్నేషనల్ అపెక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బాలికలకు శానిటరీ నాప్‌కిన్స్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో భాగంగా వారు ముందుగా టూటౌన్ సీఐ బి.తిరుమలరావుచే పోలీస్ స్టేషన్‌లో అవగాహన పోస్టర్లు ఆవిష్కరించారు. అనంతరం వెంకటేశ్వరమెట్టపై గల శ్రీ వెంకట గౌరీ శంకర గ్రంథాలయం ఆవరణలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సంస్థ విశాఖపట్నం చైర్మన్ స్వప్న వినాయక, సభ్యురాలు సునీత రుచితల ఆధ్వర్యంలో డాక్టర్ రాధిక పాటూరి పాల్గొని బాలికలకు రుతుక్రమం సమస్యపై అవగాహన కల్పించారు. సంకోచం విడిచిపెట్టి ఉల్లాసంగా ఉండాలని వారికి సూచించారు. శానిటరీ నాప్‌కిన్ వాడే ముందు, తరువాత కూడా సబ్బుతో చేతులు శుభ్రంగా కడుక్కోవాలని తెలిపారు. కాయధాన్యాలు, పచ్చి కూరగాయలు, పాలు, పెరుగు, పన్నీరు, సీజనల్ పండ్లు, పౌష్టికాహారం తీసుకోవాలన్నారు. నీరు పుష్కలంగా తాగాలన్నారు. యోగా, తేలికపాటి వ్యాయామం చేయాలని సూచించారు. కార్యక్రమంలో మహావీర్ ఇంటర్‌నేషనల్ అపెక్స్ ప్రతినిధులు పాల్గొన్నారు.

విశాఖ ఉక్కును కాపాడుకుందాం



జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద దీక్షలో పాల్గొన్న ఐఎన్‌టీయూసీ యూనియన్ నాయకులు

సీతమ్మధార : ప్రాణత్యాగం ద్వారా సాధించుకున్న విశాఖ ఉక్కును రక్షించుకుందామని ఐఎన్‌టీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి నాగభూషణం అన్నారు. ఈ మేరకు జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద జరుగుతున్న నిరాహారదీక్ష 793వ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నగరంలోని అఖిలపక్ష కార్మిక, విద్యార్థి, యువజన, మహిళా, మేధావి వర్గం అందరూ ఒక తాటిపైకి వచ్చి పోరాడుతున్నాయని అన్నారు. స్టీల్‌ప్లాంట్ లాభాల్లో నడుస్తుందని, దానిని కార్పొరేట్ సంస్థలకు అప్పగిస్తే ఉన్న ఉద్యోగాలు పోవడంతో పాటు కొత్తగా తర్వాతి తరాలకు ఉపాధి ఉండదన్నారు. అందుకే మనం దేశభక్తితో పోరాటం చేస్తున్నామన్నారు. కేంద్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. కేంద్రంలో మోదీ ప్రభుత్వం బడా పారిశ్రామికవేత్తలకు దేశ సంపదను దోచి పెడుతోందన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు నాయకులు ఎస్.అజయ్‌కుమార్, సూర్యకేశవ, బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర రైల్వే మంత్రి రాజీనామా చేయాలి

విశాఖ పౌర ప్రజా సంఘాల వేదిక డిమాండ్



రైలు ప్రమాదంలో మృతి చెందిన వారికి నివాళులు అర్పిస్తున్న ప్రజా సంఘాల నాయకులు

సీతమ్మధార: ఒడిశాలోని బాలాసోర్ వద్ద జరిగిన కోరమాండల్ ఎక్స్‌ప్రెస్ రైలు ప్రమాదానికి బాధ్యత వహిస్తూ కేంద్ర రైల్వే శాఖ మంత్రి రాజీనామా చేయడంతో పాటు మృతుల కుటుంబాలకు రూ. 50 లక్షలు, క్షతగాత్రులకు రూ. 25 లక్షలు నష్టపరిహారం చెల్లించి మెరుగైన వైద్యం అందించాలని విశాఖ పౌర ప్రజా సంఘాల వేదిక ప్రతినిధులు డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం రాత్రి జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద రైల్వే ప్రమాదంలో మృతి చెందిన మృతులకు కొవ్వొత్తులతో నివాళులు అర్పించి సంతాపం తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అత్యంత టెక్నాలజీ కలిగిన వందే భారత్, వేగవంతమైన బుల్లెట్ ట్రైన్లను రూపొందిస్తున్నామని ప్రభుత్వాలు చెబుతున్నా, ప్రమాదాల నివారణకు తగిన చర్యలు తీసుకోకపోవడం దారుణమన్నారు. గత తప్పిదాల నుంచి గుణపాఠాలు నేర్చుకోకపోవడం వల్లనే రైల్వేలో తరుచూ ప్రమాదాలు సంభవిస్తున్నాయని అన్నారు. కాగ్ వంటి ప్రభుత్వ సంస్థలు ఎప్పటికప్పుడు నివేదికలు ఇస్తున్నాయని అన్నారు. నాలుగేళ్లలో దేశంలో 422 ప్రమాదాలు జరిగాయని, వీటిలో ఎక్కువ శాతం ట్రాక్ నిర్వహణ, సిగ్నలింగ్ లోపాల వల్లనేనని అన్నారు. ప్రభుత్వాల ఘోర నిర్లక్ష్యం, వినాశకర విధానాల ఫలితంగానే తరుచూ ప్రమాదాలు సంభవిస్తున్నాయని విమర్శించారు. ఈ కార్యక్రమంలో ప్రజా సంఘాల ప్రతినిధులతో పాటు మహిళా చేతన ప్రధాన కార్యదర్శి కె.పద్మ, ఎం.వెంకటేశ్వర్లు, అశోక్, చంద్రశేఖర్, కె.నిర్మల, ఈసర లక్ష్మి, రాంప్రభు తదితర నాయకులు పాల్గొన్నారు.

వైభవుడికి సుప్రభాత సేవ

మురళీనగర్: కప్పరాడ ఎన్‌జీజీవోస్ కాలనీలో వెలసిన వైభవ వేంకటేశ్వరస్వామికి శనివారం సుప్రభాత సేవ ఘనంగా నిర్వహించారు. తెల్లవారుజామున గొల్ల సన్నిధి సేవ చేసి సుప్రభాతం చదివి వినిపించారు. అనంతరం స్వామికి అభిషేకాలు చేశారు. ఉదయం 7.30 గంటలకు బాలభోగం, 9.30 గంటలకు భక్తుల సమక్షంలో అర్చన, మంగళాశాసనం, తీర్థప్రసాద గోష్ఠి, 10 గంటలకు సామూహిక విష్ణు సహస్రనామార్చన, 11.30 గంటలకు రాజభోగ నివేదన జరిపారు. మధ్యాహ్నం 200 మంది భక్తులకు అన్నదానం చేశారు. సాయంత్రం 5.30 గంటలకు ఆకాశ దీపారాధన, రాత్రి 7 గంటలకు నక్షత్ర, కర్పూర, కూష్మాండ, కుంభ హారతులు వైభవుడికి సమర్పించారు. భక్తులు స్వామిని దర్శించుకున్నారు. ఆలయ కార్యనిర్వహణాధికారి బండారు ప్రసాద్ ఏర్పాట్లు పర్యవేక్షించారు.